ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 సంచిక : 11 జూలై 2011

# ఉత్కృష్టమైనది హృదయం

"హృదయం" అంటే ఆధ్యాత్మిక హృదయం అని అర్థం. భగవాన్ శ్రీరమణమహర్షి వివిధ సందర్భాలలో, తమ బోధలో హృదయం గురించి సవివరంగా బోధించారు. దేహధారులైన మానవులకు తలంపులు ఎక్కడ నుండి ఉదయించి, మరల గాఢనిద్రలో ఎక్కడైతే లయ మవుతున్నాయో, అదే హృదయం. హృదయ కుహర మధ్యంలో బ్రహ్మమే స్వయంగా 'నేను-నేను' అంటూ ఆత్మరూపంగా స్ఫురిస్తోంది. విచారణ వలన గాని, ప్రాణ నిరోధము వలన గాని హృదయంలో ప్రవేశించి, అదే నీవై నిలకడ కలిగివుండు. వాస్తవానికి హృదయం గురించి వర్ణించడం, నిర్వచించడం కేవలం మనో ప్రక్రియ మాత్రమే అవుతుంది. 'నేను' అను మూలతలంపు అన్ని ఇతర తలంపులకు ఆధారం, ఆ మూల తలంపు యొక్క మూలమే హృదయం. హృదయం అంటే రక్తాన్ని దేహానికి సరఫరా చేసే గుండె కాదు. హృదయం దేహంలో ఒక భాగం కాదు. హృదయం అంటే 'ఇదీ-కేంద్రం' అని అర్థం. హృదయం అంటే ఆత్మ. హృదయం అంటే 'గురువు'. దేహంలో గుండె ఎడమ ప్రక్క ఉంటే, హృదయం అనగా హృదయస్థానం వక్షస్థలానికి కుడి భాగంలో ఉంటుందని స్వానుభవముతో భగవాన్ శ్రీ రమణమహర్షి సూచించారు. హృదయం నుండి చిత్‌ప్రకాశం సుషుమ్న నాడి ద్వారా సహస్రారానికి చేరి దేహమంతటా వ్యాపించి ప్రపంచానుభూతిని కలిగిస్తుంది. సహస్రారం, సుషుమ్ననాడి రెండూ చైతన్యం నుండి వేరు అనుకోవడం వల్ల మనుష్యులు భ్రాంతిలోపడి, జనన-మరణ సంసారంలో చిక్కుకొంటారు. ఆత్మనిష్ఠుడైన జ్ఞాని సహస్రారం శుద్ధ చైతన్యంగా ఉంటుంది, దానిని చేరే ప్రతి తలంపు ఉనికిని కోల్పోయి నశిస్తుంది. జ్ఞాని దృశ్య ప్రపంచాన్ని తనకన్న వేరుగా చూడడు. జ్ఞానికి దేహం, ప్రపంచంతో సహా సమస్తం 'ఆత్మ'గా హృదయంలో ప్రకాశిస్తుంది. విశ్వం

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
హైదరాబాదు ... 26-10-2010
కాపవరం ........ 17-12-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

అంటే పంచభూతాలు, అవే పంచభూతాలు దేహంలోనూ, దేహం మనస్సులోనూ, మనస్సు హృదయంలోను ఇమిడి ఉన్నాయి కాబట్టి సృష్టి సకలమూ హృదయం లోనే ఉంది. హృదయం నుండి సృష్టి సకలమూ వ్యక్తమై తిరిగి హృదయంలో అణిగిపోతోంది. ప్రపంచానికి సూర్యుడు ఎట్లో, దేహానికి హృదయం అట్లు! సూర్యుడు ఎలాగైతే చంద్రుడిని ప్రకాశింపజేస్తున్నాడో, అదేవిధంగా హృదయం మనస్సును ప్రకాశింపజేస్తుంది. సూర్యాస్తమయం తరువాత సూర్యుని సంబంధం గుర్తించకుండా ఒక్క చంద్రకాంతినే చూచినట్లు హృదయం యొక్క ఎరుకలేని కారణంగా మనస్సును ప్రత్యేకమైన ఉనికిగల దానిగా భావించడం జరుగుతుంది. హృదయం నిజమైన చైతన్య కేంద్రం అయినప్పటికీ హృదయం కన్న వేరుగా మనస్సును భావించి, దృశ్యాలను గ్రహించుట వలన అవి చూచు వానికన్న వేరుగా ఉన్నాయనే భ్రాంతి కలుగుతుంది. సూర్యోదయం అయిన తరువాత చంద్రకాంతి సూర్యకాంతిలో లయం అయినట్లు, ఆత్మనిష్ఠుడైన జ్ఞాని మనస్సు హృదయంలో ఐక్యమైపోతుంది. ప్రజ్ఞానం అనగా ఆత్మజ్ఞానమే! అభేద జ్ఞానమే! మనస్సు ఆధారంగా తెలియబడే విషయజ్ఞానం కాదు. ద్రష్ట-దృశ్యములు మనస్సుచేత వేరుగా భావింపబడతాయి, కాని హృదయ నిష్ఠులకు దృక్-దృశ్య అభేదత్వం సిద్ధిస్తుంది. ఎప్పడైనా అత్యధిక సంతోషం, నిద్ర, భయం మున్నగునవి కలిగినప్పడు మనస్సు బలవంతంగా ఆగి తన మూలమైన హృదయాన్ని చేరుతుంది. పరిపూర్ణంగా హృదయంలో ఉన్న పరమాత్మకు శరణాగతి చెందితే, హృదయంలో ఉన్న సత్యంతో అభేద నిష్ఠలో ఉంటే, విజయం వరిస్తుంది, దానికి కారణం హృదయంలో మనస్సు తన ఉనికిని కోల్పోతుంది. అప్పడు అక్కడ మిగిలేది పరమశాంతే! కేవలం ఆత్మే! కేవలం హృదయమే!

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-10-2010, హైదరాబాదు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సంతానం బుద్ధిమంతులు అయితే అది సంపద కంటే విశేషం. కొంతమందికి ధనం లేకపోయినా వాళ్ల సంతానమే వారికి సంపద. కొంతమంది వాళ్ల తల్లిదండ్రుల ప్రవర్తన ఎలా ఉన్నా వారిని చాలా ప్రేమగా చూస్తారు. మీ జీవితంలో వారు ఏమీ సహకరించలేదు కదా మీరు ఎందుకు అంతప్రేమగా చూస్తున్నారు అని అడిగితే వారి దగ్గర నుంచి మాకు సహకారం వచ్చిందా లేదా అది అనవసరం, వారు మాకు ఆస్తి ఇవ్వకపోయినా శరీరాలు ఇచ్చారు కాబట్టి మా డ్యూటీ మేము చేస్తున్నాము అని చెబుతారు. తల్లికి ఇచ్చిన మాటకి జీవితం పొడుగునా కట్టుబడిన మహాత్ములు ఉన్నారు. ఆచార్యుల వారు సర్వసంగ పరిత్యాగి, ఆయన సన్యాసం తీసుకొని వెళ్లేటప్పడు తల్లిగారికి ఇచ్చిన మాట నిలబెట్టటానికి తల్లి ప్రాణం పోయేటైముకి శృంగేరీ నుంచి కాలడి వచ్చారు. ఆవిడ జీవితం పొడుగునా విష్ణువుని ఆరాధించేది. వారి పూర్వీకుల

దగ్గర నుంచి వచ్చిన కృష్ణుడి విగ్రహం ఇప్పుడు కూడా కాలడిలో ఉంది. తల్లి చివర టైములో ఆచార్యులవారు శివుడిని సాక్షాత్కరింపచేసి ఆ శివుడి రూపం మీద మనస్సు పెట్టి శరీరాన్ని విడిచిపెట్టమని చెప్పారు. నాకు ఆ రూపం మీద మనస్సు నిలబడటం లేదు అని తల్లి చెప్పింది. మహావిష్ణువుని తల్లిగారికి అవసానదశలో ప్రత్యక్షం చేసారు. అప్పడు ఆ మహావిష్ణువు రూపం మీద మనస్సుపెట్టి, ఆ నామాన్ని స్మరించుకొంటూ, ఆ రూపం ద్వారా, నామం ద్వారా ఆర్యాంబ తరించింది.

శ్రీకృష్ణచైతన్యుడికి బృందావనం అంటే ఎక్కువ ఇష్టం. శ్రీకృష్ణ చైతన్యుడు శ్రీకృష్ణుడి అంశవల్ల జన్మించాడని కృష్ణభక్తులు నమ్మకం. గౌడీయ మతానికి, హరేకృష్ణ ఉద్యమానికి మూలం శ్రీకృష్ణచైతన్యుడే. చైతన్యుడితోటి తల్లి అంటుంది బృందావనం మనకి చాలా దూరం, పూరీజగన్నాథం కూడా విష్ణుక్షేత్రమే నువ్వు బృందావనం వద్దు, పూరీ జగన్నాథంలో ఉండు. ఎప్పుడైనా నిన్ను చూడటానికి నేను రావచ్చు అని తల్లి చెబితే తన ఇష్టాలన్నీ వదులుకుని తల్లి మాటకు కట్టుబడి చివరి రోజు వరకూ పూరీలో ఉండిపోయాడు శ్రీకృష్ణచైతన్య. గాంధీగారికి కూడా మాతృభక్తి ఎక్కువ. ఆయన బారిష్టరు చదువుకోవడానికి ఇంగ్లాండు వెళ్ళినప్పడు తల్లి అంది నీకు చదువు వచ్చినా, రాకపోయినా ఇబ్బంది లేదు నువ్వు సంపాదించకపోయినా ఇబ్బందిలేదు, నువ్వు ఇంగ్లాండు వెళ్ళి మాంసం, చేపలు తిని, సారా తాగి అక్కడ చెడ్డ అలవాట్లు నేర్చుకుని అక్కడ నుంచి బారిష్టరు సర్టిఫికెట్ తెచ్చుకున్నా నేను సంతోషించను అని చెప్పింది. ఆ మాట నిలబెట్టుకోవటంకోసం గాంధీగారు తన శీలాన్ని బాగా కాపాడుకున్నారు. గాంధీగారు చిన్నప్పడు చెడ్డస్నేహాల వలన దొంగతనంగా ఇంట్లో డబ్బులు తీసుకుని వెళ్ళి బీడీలు కొనుక్కునేవాడు. గాంధీగారు తండ్రి డబ్బులు పోతున్నాయని తల్లిని తిట్టేవారు. గాంధీగారు గొప్ప బుద్ధిమంతుడని వాడు దొంగతనం చెయ్యడు అని తండ్రి ఉద్దేశ్యం. డబ్బులు నువ్వు ఖర్చు పెట్టేస్తున్నావా అని తల్లిని తిట్టటం గాంధీగారు విన్నారు. దొంగతనం నేను చేస్తుంటే అమ్మని తిడుతున్నారు అని గాంధీగారికి బాధకలిగి దొంగతనం చేసినట్టు నోటితో చెప్పలేక, నేను దొంగతనంగా డబ్బులు పట్టుకువెళ్ళి బీడీలు కాల్చుకుంటున్నాను మీరు అమ్మని తిట్టకండి అని ఒక లెటరు వ్రాసారు. ఆ లెటరు తండ్రి చదివి నువ్వు దొంగతనాలు చెయ్యవద్దు, బీడీలు కాల్చవద్దు అని తిట్టలేదు, చిన్న పిల్లవాడు కదా అని రెండు దెబ్బలు కొట్టలేదు. ఎదురుగుండా కూర్చుని వీడు మహాత్ముడు అనుకుంటున్నాను, వీడు ఇలా బీడీలు కాలుస్తున్నాడా అని బొటబొటా కన్నీరు కార్చాడు. తండ్రి కళ్ళమ్మట వచ్చిన కన్నీళ్ళు నాలో ఉన్న దోషాలు, నాలో ఉన్న బలహీనతలు, ఈ దొంగబుద్ధి అంతా కడిగేసింది అని బాపూజీ చెప్పాడు. గాంధీగారి తండ్రికి కళ్ళమ్మటా వచ్చిన కన్నీరే గాంధీగారికి మారుమనస్సు తీసుకువచ్చింది. ఆ విషయంలో గాంధీగారు చాలా నేర్చుకున్నారు. అసత్యం పలికేవాడు ఎలా బతికినా పరవాలేదు. సత్యం పలికేవాడు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి, అజాగ్రత్తగా ఉండకూడదు.

జార్జివాషింగ్టన్ తల్లిగారు వాషింగ్టన్‌కి చిన్నప్పుడు ఒకమాట చెప్పేవారు. మనకంటే పెద్ద వాళ్ళు చాలామంది ఉంటారు, ధనంలో ఉంటారు, విద్యలో ఉంటారు, నువ్వు జీవితంలో ఒకటి నేర్చుకో ఎవరైనా నీకంటే ఏ రంగంలో అభివృద్ధిలో ఉన్నా వాళ్ళని చూచి సంతోషించు కానీ అసూయపడవద్దు. నేను చెప్పిన ఈ మాట నా శరీరం చనిపోయిన తరువాత కూడా జ్ఞాపకం పెట్టుకో అని వాషింగ్టన్‌కి తల్లి చెప్పింది. వాషింగ్టన్ చివరిరోజులలో తల్లిచెప్పినమాట ఎంతో అందంగా చెప్పాడు. నేను నా జీవితంలో ఎవరిని చూచి అసూయపడలేదు. ఎందుకు అసూయపడలేదు అంటే ఇతరులను చూచి అసూయపడి నన్ను నేను పాడుచేసుకోను, నా చైతన్యస్థాయిని పడగొట్టుకోను అన్నాడు. నన్ను నేను పాడుచేసుకోకుండా ఉండటం కోసం ఇతరుల్ని చూసి అసూయపడను అని వాషింగ్టన్ చెప్పాడు.

జ్ఞాని యొక్క ప్రభావం భక్తుని హృదయంలోనికి మౌనంగా ప్రవేశిస్తుంది, మాటకంటే మౌనానికి ఎక్కువ శక్తి ఉంది. మాటలు వెండి, మౌనం బంగారం. హృదయం, హృదయం తోటి మాట్లాడుకునేటప్పుడు మాటలతోటి పనిఏముంది అనేవారు భగవాన్. మన హృదయంలో ప్రేమ ఉన్నప్పుడు, ఆప్యాయత ఉన్నప్పుడు మాటలతో పనిలేదు. కడుపులో లేనప్పుడు కౌగిలించుకుంటే వస్తుందా అని సామెత ఉంది. మాట్లాడకుండా నోరు మూసుకుని కూర్చుంటే అది మౌనం కాదు. మౌనం అంటే నిశ్శేషంగా నీ మనస్సు, ఇంద్రియాలు సత్యంలో 100% ఏకం అవ్వాలి. అప్పుడు మౌనం పుడుతుంది. ఆ మౌనం యొక్క ప్రభావం పరిసరాల మీదేకాదు, మానవజాతి మీద అంతా కూడా ప్రభావం చూపుతుంది. అటువంటి మౌనం ఎవరైతే సాధించారో వారితోటి మానసికసంబంధం వలన నీ హృదయంలో ఉన్న నిజం తెలుసుకోవడానికి మేగ్జిమమ్ ఉపయోగపడుతుంది. మహాత్ములతోటి సాంగత్యం వలన తక్కువ పెట్టుబడితోటి ఎక్కువ లాభం వస్తుంది. ఈ ప్రపంచానికి రెండు గుణాలు పరమాత్మ చెప్పాడు. 1. అనిత్యం, 2. అసుఖం. ఈ ప్రపంచంలో ఏ పదార్థం కూడా నిత్యంగా ఉండదు. కాలప్రవాహంలో ప్రతీది కొట్టుకుపోతుంది. ఈ ప్రపంచం ఈ రోజు ఉన్నట్టు రేపు ఉండదు ఇది అనిత్యం. అసుఖం - ప్రపంచములో ఏ వస్తువులోను, ఎక్కడా సుఖమనేది లేదు. అది నీకు అనుభవానికి రాకపోయినా మీ మెదడు దానిని గ్రహించాలి, ఆ అండర్‌స్టాండింగ్ నీకు రావాలి. బాహ్యంగా ఏ వస్తువులోను సుఖంలేదని తెలిస్తే నీ మైండుకి వాండరింగ్ తగ్గుతుంది. సుఖం అనేది ఒక్క బ్రహ్మపదార్థంలోనే ఉంది. బ్రహ్మంకి లోపలా, బయట లేదు. అది అంతటా ఉంది. నిప్పు ముట్టుకుంటే కాలుతుంది. అది నిప్పు యొక్క నేచర్ అలాగే బ్రహ్మ పదార్థం యొక్క నేచర్ ఏమిటి అంటే ఆనందం తప్పించి అక్కడ ఏమీ లేదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. దానిని నువ్వు తెలుసుకున్నా, తెలుసుకోలేకపోయినా నిజం ఉందని గుర్తించడానికి కూడా మహాత్ములతోటి సహవాసం ఉండాలి. అది ఉందని మనకి తెలుస్తూ ఉంటే దానిని తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తాము. మన మనస్సు ఎన్ని వేలమైళ్ళు అయినా

బయటకు దూసుకువెళ్ళగలదు కాని, ఒక్క అంగుళం లోపలికి వెళ్ళమంటే వెళ్ళదు. ఎన్నో జన్మల నుంచి దానికి బయటచూపు అలవాటు అయిపోయింది. ఇంద్రియాలు కూడా మనస్సును బయటకు లాగేస్తాయి. మనస్సుకి సుఖం కావాలి. ఆ సుఖం ఎక్కడ ఉందో మనస్సుకి తెలియదు. బయటవిషయాలలో సుఖం ఉందని మనస్సు అలవాటు పడిపోతే నిన్ను ఎవడు ఉద్ధరిస్తాడు. అందుచేత నువ్వు జ్ఞానిని ఆశ్రయించు. ఒక్క ఆత్మజ్ఞాని మాత్రమే నీకు ఆత్మను ఎరుకలోకి తీసుకువస్తాడు. సుఖం అనేది నీకు ఆత్మలోనే ఉంది.

**అవ్యయ సుఖం** - బ్రహ్మము తాలుక సుఖం అవ్యయం. ఆ సుఖం తరగని సుఖం. కాని మీరు ఎవరినైనా ముద్దుపెట్టుకుంటున్నారు అనుకోండి, మొదటిముద్దు బాగానే ఉంటుంది. రెండు, మూడుసార్లు ముద్దుపెట్టుకునేటప్పటికి విసుగువచ్చేస్తుంది, మీకు బాగా నిద్ర వచ్చేస్తుంది అనుకోండి ఎవరైనా బంగారం తీసుకువచ్చి ఇస్తూ ఉంటే రేపు ఇద్దురుగాని లెండి అని అలా నిద్దరలోకి వెళ్ళిపోతారు. ఎందుచేత మీకు నిద్ర ఇచ్చే సుఖం ఆ సంపద కూడా ఇవ్వలేదు. గాఢనిద్రలో మైండు తన సోర్సులోకి వెళుతుంది. అక్కడ ఉన్న సుఖం బాహ్యపదార్థాలలో ఎక్కడా లేదు. బ్రాహ్మీస్థితి పొందినవాడికి ఏ క్షణానికి ఆ క్షణం ఆ సుఖం ఇప్పుడే ఫ్రెష్‌గా అనుభవిస్తున్నాము అనిపిస్తుంది.

**అభవ** - అది పుట్టలేదు. మనకి దేహం పుట్టింది. దేహానికి సంబంధించిన మనస్సు, ఇంద్రియాలు వాటి తాలుకా ఎంజాయ్‌మెంట్స్ మనకు తెలుస్తున్నాయి కాని పుట్టని పదార్థం బ్రహ్మము. దాని స్వభావమే సుఖం. దానిని మనం ఇంతవరకు అనుభవైకవేద్యం చేసుకోలేదు. అది నీ ఇంద్రియాలకు అందదు, నీ మనస్సుకు అందదు. అది నీ అనుభవానికి అందుతుంది. అందుచేత భగవంతుడు ఏమన్నాడు అంటే ఏ సుఖాన్ని నువ్వు పొందినతరువాత దానితోటి సమానమైన సుఖం కాని, దానికి మించిన సుఖంకాని నీకు లేదని తెలుస్తుందో అటువంటి బ్రాహ్మీస్థితిని నువ్వు పొందు అర్జునా అంటాడు. నువ్వు ఆ బ్రాహ్మీస్థితిని పొందాలి అంటే నేను, నాది ఆ రెండూ తగ్గించుకుంటూ రావాలి. బ్రాహ్మీస్థితి పొందినవాడు ధనం మధ్యలో ఉన్నా, పేదరికం మధ్యలో ఉన్నా వాడికి బయటవిషయాలు అనుకూలంగా ఉన్నా, అనుకూలంగా లేకపోయినా వాటి ప్రభావం ఏమీ జ్ఞానిమీద పడదు. అన్ని కాలాల్లో సముద్రం ఎలా సమానంగా ఉంటుందో అలాగే బ్రాహ్మీస్థితి పొందినవాడు నిర్వికారంగా, నిర్మలంగా, నిశ్చలంగా ఉంటాడు.

చిత్‌సుఖం అంటే సత్, చిత్, ఆనందం, ఏదైతే సత్తో అదే చిత్, ఏదైతే చిత్తో అదే ఆనందం. ఒకటే పదార్థాన్ని మూడుపేర్లతోటి మనకి అవగాహన కోసం చెబుతున్నారు. చిత్‌సుఖం అంటే అది బ్రహ్మము తాలుకా సుఖం. అది డిపెండెంట్ హేపీనెస్ కాదు. అది ఇండిపెండెంట్ హేపీనెస్. డిపెండెంట్ హేపీనెస్ కాలప్రవాహంలో పోతుంది, ఇండిపెండెంట్ హేపీనెస్ నీకు లోపల నుంచే సప్లై అవుతూ ఉంటుంది. మనకి గాఢనిద్రలో కూడా అటువంటి హేపీనెస్ ఉంది. అందుకే మనకి నిద్దట్లోకి వెళ్ళాలనిపిస్తుంది. అయితే గాఢనిద్రలో మనకి

హేపీనెస్ ఉంది కాని ఎరుకలేదు. జాగ్రదావస్థలో మనకి ఎరుక ఉంది కాని హేపీనెస్ లేదు. ఆ రెండూ సైమల్‌టేనియస్‌గా మీరు అనుభవంలోనికి తెచ్చుకోవటమే యోగం యొక్క ప్రయోజనం. యోగం అంటే చిత్తవృత్తి నిరోధం. గౌతమబుద్ధుడు నిర్వాణసుఖం గురించి చెప్పాడు. నిర్వాణసుఖం అంటే పరిపూర్ణస్థితి. మన శరీరాలు ఏదో రోజున చనిపోతాయి. మీ శరీరానికి మరణం వచ్చినప్పుడు నువ్వు పరిపూర్ణమైన సుఖంలో ఉండి, నీ మనస్సు సుఖంకోసం ప్రపంచంలో ఎక్కడా వాలకుండా ఉంటే మీకు పునర్జన్మ లేదు అని మీకు కొండగుర్తు చెబుతున్నాను అని బుద్ధుడు చెప్పాడు. కబీరు అన్నాడు నువ్వు పుట్టేటప్పుడు ఏడుస్తూ పుడుతున్నావు, చనిపోయేటప్పుడు అయినా ఆనందంగా చావు అని చెప్పాడు. పుట్టినప్పుడూ ఏడుపే, చనిపోయేటప్పుడు ఏడుపే, ఇంక జీవితం పొడుగునా ఏడుపేనా పని, నీకు ఇంకోపని లేదా? నువ్వు ట్రైనింగు అవ్వు. నువ్వు ఎలా ట్రైనింగు అవ్వాలంటే చనిపోయేటప్పుడు ఇంక ఏడుపు ఉండకూడదు, ఆనందంగా చనిపోవాలి. కనీసం నువ్వు చనిపోయేరోజు వచ్చేటప్పటికి అయినా దుఃఖంలేని స్థితికి ఎదిగివెళ్ళాలి అని కబీరుదాసు చెప్పాడు. మీకు ఆస్థులు, అంతస్తులు అన్నీ ఉన్నాయి. అయినా మీకు దుఃఖం వస్తూఉంటే ప్రయోజనం ఏమిటి? వాటిని ఏమి చేసుకుంటారు. ఒక్కజ్ఞాని మాత్రమే మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకువెళ్ళగలడు కాని మామూలు పండితుడు ఎవడూ మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకువెళ్ళలేడు. అందుచేత జ్ఞానితోటి సాంగత్యము మంచిది, వారు మౌనంగా పని చేస్తారు. జ్ఞాని దగ్గర నుండి మీకు సహకారం అందుతూ ఉంటే అది మీకే తెలుస్తూ ఉంటుంది కాని మీ ప్రక్కవాడికి కూడా తెలియనివ్వడు.

అన్నదానం, విద్యాదానం, జ్ఞానదానం. జ్ఞానదానం ఒక్క ఆత్మజ్ఞానికే సాధ్యం కాని అన్నదానం చేసేవారు, విద్యాదానం చేసేవారు మనకి జ్ఞానదానం చెయ్యలేరు. జ్ఞానదానం చేయటానికి వారికి జ్ఞానం ఉండాలి కదా, మనకి ఉన్నదేదైనా ఎదుటి వాళ్ళకి ఇవ్వగలం కాని, మనకి లేనిది ఎదుటివాళ్ళకి ఏమి ఇస్తాము. అందుచేత జ్ఞానితోటి సాంగత్యం మంచిది. వాళ్ళు డబడబలు ఆడరు, జ్ఞానికి టాంటాం అక్కరలేదు. కాని అజ్ఞానికి ఒక మంచిపని చేస్తే ప్రపంచం అంతా తెలిసిపోవాలి అనుకుంటాడు. వాళ్ళని కీర్తికాములు అంటారు. ఇంక వాళ్ళకి జ్ఞానం ఏమిటి? మీరు ఫలకాంక్ష ఏదైనా పెట్టుకొని పనిచేస్తే ఫలితం వస్తుంది. అనుభవిస్తే పోతుంది. రమణమహర్షిగారు అన్నారు, అనుభవిస్తే పోయినా ఫరవాలేదు, పోస్టుకార్డుల మీద ముద్రలు వేసినట్టు అది మీ మనస్సులో ముద్రలు వేస్తుంది. మీరు పుణ్యం చేస్తారు. సుఖం వస్తుంది. ఆ సుఖం అనుభవించేటప్పుడు వాసన పడుతుంది. ఆ వాసన ఏమి చేస్తుంది అంటే మళ్ళీ ఆ భోగం కావాలంటే ఎలా ప్రయత్నం చేస్తే ఆ భోగాలన్నీ వస్తాయో చెపుతుంది. అంటే పుణ్యం వల్ల వచ్చే భోగం మళ్ళీ మీ మనస్సుని బాహ్యాముఖానికి తోలేస్తుంది కాని హృదయాభిముఖంగా మీ మనస్సుని వెళ్ళనివ్వదు. అది మరీ ప్రమాదం అని భగవాన్ చెప్పారు.

